ఇంత అహంకార ప్రభుత్వాన్ని చూడలే

- రేవంత్‌రెడ్డి చెప్పేవి అబద్ధాలు
- ఉపాధ్యాయ దినోత్సవంరోజే టీచర్లకు అవమానం
- ఉద్యోగ సంఘాల గొంతు చచ్చిపోయిందా?
- కోదండరాం, మురళి ఎక్కడ?
- ఎస్టీయూ, జాక్టో మాజీ అధ్యక్షుడు భుజంగరావు

ఎస్టీయూటీఎస్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, జాక్టో మాజీ చైర్మన్ భుజంగరావు

హైదరాబాద్, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ) : ఇప్పుడున్నంత అహంకార, విధ్వంసపూరిత సర్కారును తానెప్పుడూ చూడలేదని ఎస్టీయూటీఎస్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, జాక్టో మాజీ చైర్మన్ భుజంగరావు అసహనం వ్యక్తం చేశారు. అబద్ధాలాడటంలో సీఎం రేవంత్‌రెడ్డి నంబర్ వన్ అని, ఆయన మోసకారి అని విమర్శించారు. ప్రభుత్వ తీరుపై ఉద్యోగులు, ఉపాధ్యాయుల్లో తీవ్ర వ్యతిరేకత కనిపిస్తున్నదని చెప్పారు. మంగళవారం 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడిన ఆయన టీచర్స్ డే సందర్భంగా విద్యాశాఖ మంత్రిగా ఉండి టీచర్లకు అవార్డులిచ్చే తీరిక రేవంత్‌రెడ్డికి లేదా? అని ప్రశ్నించారు. పక్కరాష్ట్రంలో వరదలొచ్చినా టీచర్స్‌డే సందర్భంగా సీఎం చంద్రబాబు ఉపాధ్యాయులకు అవార్డులిచ్చారని, ఈ సంస్కారం రేవంత్‌రెడ్డికి లేదా? అని నిలదీశారు. టీచర్స్‌డే రోజునే సీఎం రాష్ట్రంలోని టీచర్లను అవమానించారని ఆగ్రహం వ్యక్తంచేశారు. 'సీఎం రెండుసార్లు మీటింగ్ పెడితే ఉద్యోగులు, ఉపాధ్యాయులంతా పోలోమని పోయిండ్రు. సభలో సీఎం బ్రహ్మాండమైన ప్రసంగం చేసిండు. కానీ ఉద్యోగులకు ఆర్థిక ప్రయోజనాలు కల్పించే ఒక్క ప్రకటన కూడా చేయలేదు' అని దుయ్యబట్టారు.

ఐదు డీఏల అడ్రస్ లేదు

'మార్పు మార్పు అని మేము కాంగ్రెస్ వెంట పరిగెడితే ఉద్యోగులకు ఒరిగిందేమీ లేదు. ఐదు శాతం ఐఆర్, ఆరు గ్యారెంటీలు అటకెక్కినయి.. ఐదు డీఏలు అడ్రస్‌లేకుండా పోయినయ్. 18.7శాతం ఉద్యోగులకు డీఏ రావాల్సి ఉన్నది. ఒక్కో టీచర్, ఉద్యోగికి నెలకు రూ.15 వేల నుంచి రూ.20 వేలు సర్కారు బాకీపడింది. రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్ తప్ప ఒక్క ప్రయోజనం అందలేదు. పిల్లల పెండ్లిళ్లు చేద్దామన్నా.. ఇల్లు కట్టుకుందామన్నా రిటైర్మెంట్ బెన్‌ఫిట్లు రావడం లేదు. హెల్త్‌కార్డుల ఊసేలేదు. మెడికల్, జీపీఎఫ్, సరెండర్ లీవుల బిల్లులు పెండింగ్‌లోనే ఉన్నయ్' అని చెప్పారు.

మీ గొంతులను అమ్మేసుకున్నరా?

'మేధావులమని గొప్పలు చెప్పుకునే కోదండరాంరెడ్డి, ఆకునూరి మురళి ఎక్కడికి పోయిండ్రు? మీకు ప్రజలు, విద్యార్థుల కష్టాలు పట్టవా? గురుకులాల్లో పురుగులన్నం పెడుతున్నరు. ఆర్జీయూకేటీ, పాలమూకుల గురుకులాల పిల్లలు రోడ్డెక్కిండ్రు. దీనిపై మీరెందుకు స్పందించరు? మీ గొంతులను అమ్మేసుకున్నరా? మీ వ్యక్తిత్వాన్ని కుదువపెట్టిండ్రా? ఒకటో తేదీన వేతనాలిస్తున్నానని గొప్పలు చెప్పుకుంటున్నరు. చాలా జిల్లాల్లో ఇంత వరకు వేతనాలు రాలేదు. దీనిపై ఎందుకు మీరు మాట్లాడటంలేదు? డీఎస్సీ నిర్వహణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ఏకంగా డీఎస్సీ ఫైనల్ కీలో తప్పులున్నాయంటే ఇదేం ప్రభుత్వమన్న అనుమానాలొస్తున్నాయి. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా విద్యా కమిషన్‌ను పూర్తిగా పునరావాసకేంద్రంగా మార్చేసిన ఘనత రేవంత్‌రెడ్డి సర్కారుదే' అంటూ మండిపడ్డారు.

కేసీఆర్ ఇచ్చిన పీఆర్సీలను మరువం

'ఏ మాటకామాట చెప్పుకోవాలి. రాజకీయాలు అవసరంలేదు. కేసీఆర్ స్ట్రెయిట్ ఫార్వర్డ్ మనిషి. అడగకముందే అన్నీ ఇచ్చే మనసున్న మారాజు. కొత్త రాష్ట్రం.. కొత్త సంసారం. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై అవగాహనే రాలేదు. ఉమ్మడి రాష్ట్రంలో ఆగమైన తెలంగాణలో అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన పీఆర్సీని జీవితంలో ఎవరూ మరిచిపోరు. మొదట 43శాతం ఫిట్‌మెంట్ ఇచ్చిన మనసున్న మారాజు కేసీఆర్. రెండో పీఆర్సీలో 30శాతం ఫిట్‌మెంట్ ఇచ్చారు. రెండు పీఆర్సీలు కలిపితే 73శాతం ఫిట్‌మెంట్ ప్రకటించిన గొప్ప నేత. ఎన్నికల ముందు 5 శాతం ఐఆర్ ప్రకటించారు. మళ్లీ పవర్‌లోకి వస్తే కడుపునిండా పీఆర్సీ ఇస్తా నన్ను నమ్మండి అన్నడు. కానీ మార్పు అని కాంగ్రెస్‌ను నమ్మితే నట్టేట ముంచిండ్రు.' అంటూ నాటి రోజులను గుర్తుచేస్తూనే కాంగ్రెస్ సర్కార్‌పై నిప్పులు చెరిగారు.

అప్పుడు యుద్ధం చేసినోళ్లు ఇప్పుడేరి?

'గతంలో ప్రగతిభవన్‌లో మీటింగ్ పెడితే ఉద్యోగులు, ఉపాధ్యాయ సంఘాలు కొట్లాడినంత పనిచేసినయ్. కేసీఆర్‌తో అంశాల వారీగా అందరూ కొట్లాడిండ్రు. ఓ రకంగా ఆయనతో యుద్ధమే చేసిండ్రు. ఇప్పుడు యుద్ధం కాదు కదా కనీసం మాట్లాడే సాహసం కూడా చేయడం లేదు. ఏం గొంతు చచ్చిపోయిందా? ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నేతలు మనస్సులో అంత బాధపెట్టుకొని ఎందుకు భయపడుతున్నరు? ఒక్కటంటే ఒక్క ఆర్థిక ప్రకటన ఇప్పించడంలో ఎందుకు విఫలమైండ్రు? దీనికి సంఘాల నేతలే సమాధానం చెప్పాలి' అని డిమాండ్ చేశారు. 'సమస్యలపై సంఘాలు ఎందుకింత మౌనంగా ఉన్నాయని ఉద్యోగులు నిలదీస్తున్నరు. అంతా ఫోన్లు చేసి ఆవేదన వ్యక్తంచేస్తున్నరు. ఇదేం ప్రభుత్వం?. ఇదేం ప్రజాపాలన అని ప్రశ్నిస్తున్నరు. పీఆర్సీపై ఇప్పటికీ సంఘాలు ఎందుకు మాట్లాడటంలేదని నిలదీస్తున్నరు. ఎవరూ మాట్లాడే ధైర్యం చేయడంలేదేందుకని రగిలిపోతున్నరు' అని భుజంగరావు ఆవేదన వ్యక్తంచేశారు.

చిన్నారిని పీక్కుతిన్న వీధి కుక్కలు

నిజామాబాద్ జిల్లా బోధన్‌లో విషాద ఘటన

శక్కర్‌నగర్, సెప్టెంబర్ 10: వీధి కుక్కలు పది నెలల చిన్నారిపై దాడి చేసి చంపేశాయి. చిన్నారి మృతదేహాన్ని అత్యంత కిరాతకంగా పీక్కుతిన్నాయి. నిజామాబాద్ జిల్లా బోధన్‌లో సోమవారం రాత్రి జరిగిన ఈ ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. బోధన్ పట్టణంలో ఓ మహిళ యాచిస్తూ పొట్టపోసుకుంటున్నది. ఆమెకు పది నెలల కుమారుడున్నాడు. కొత్త బస్టాండ్ ప్రాంతంలో ఉండే ఆమె సోమవారం రాత్రి బాబును ఓ చెట్టు కింద ఉంచి పనిమీద వెళ్లింది. కాసేపటి తర్వాత వచ్చి చూస్తే బాబు కనిపించలేదు. చుట్టుపక్కల ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసిన పోలీసులు రంగంలోకి దిగారు. పట్టణ సీఐ వెంకటనారాయణ తన సిబ్బందితో కలిసి.. బాబు అదృశ్యమైన ప్రాంతాన్ని పరిశీలించారు. చుట్టుపక్కల ఆరా తీయగా మంగళవారం తెల్లవారుజామున కుక్కలు ఓ బాబును నోట పట్టుకుని వెళ్లినట్టు స్థానికుడు పోలీసులకు తెలిపాడు. స్థానికుడు ఇచ్చిన సమాచారం మేరకు ఆ ప్రాంతాన్ని పరిశీలించగా అక్కడక్కడ మాంసపు ముద్దలు దొరికాయి. అవి చిన్నారి అవయవాలుగా గుర్తించి బాలుడిని కుక్కలు చంపేసి పీక్కుతిన్నట్టు నిర్ధారించారు. వాటిని సేకరించి బోధన్ ప్రభుత్వ దవాఖానలో అప్పగించారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. వీధి కుక్కల బెడదతో అల్లాడిపోతున్న స్థానికులు తాజా విషాదం నేపథ్యంలో వణికిపోతున్నారు. ఇటీవలే తట్టికోట్ ప్రాంతంలో ఓ బాలుడిని కుక్కలు మెడ పట్టుకుని ఎత్తుకెళ్తుండగా అడ్డుకున్న గర్భిణితోపాటు పలువురిపై దాడి చేశాయి. ఆ ఉదంతం మరువక ముందే మరో బాలుడు కుక్కలకు ఆహారంగా మారడం స్థానికంగా తీవ్ర భయాందోళన నెలకొంది.

గృహిణిపై డెలివరీ బాయ్ లైంగికదాడికి యత్నం

- ఆర్డరు చేసిన వస్తువులను ఇవ్వడానికొచ్చి దుశ్చర్య
- మహిళ కేకలు వేయడంతో పరారైన యువకుడు
- అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు

సోన్, సెప్టెంబర్ 10: ఓ గృహిణిపై డెలివరీ బాయ్ లైంగికదాడికి యత్నం చేశాడు. సదరు మహిళ కేకలు వేయడంతో అక్కడి నుంచి పారిపోతుండగా స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన మంగళవారం నిర్మల్ జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. పట్టణంలోని మంజులాపూర్ కాలనీకి చెందిన ఓ గృహిణి మూడు రోజుల క్రితం ఇయర్‌ఫోన్స్ కోసం ఫ్లిప్‌కార్టులో ఆన్‌లైన్‌లో ఆర్డర్ పెట్టింది. సంబంధిత కంపెనీకి చెందిన డెలివరీ బాయ్ విఘ్నేశ్ ఇయర్‌ఫోన్స్ తీసుకొని మంగళవారం ఉదయం 11-12 గంటల మధ్య డెలివరీ చేసేందుకు ఆమె ఇంటికి వచ్చాడు. గృహిణి భర్త ఉదయం 10 గంటలకు విధులకు వెళ్లడంతో ఇంట్లో ఒంటరిగా ఉంది. ఇదే అదునుగా భావించిన ఆ డెలివరీ బాయ్.. గృహిణిపై లైంగికదాడికి యత్నించాడు. అప్రమత్తమైన ఆ మహిళ కేకలు వేసి ఇరుగుపొరుగు వారిని పిలిచింది. వెంటనే యువకుడు బైక్‌పై పారిపోతుండగా స్థానికులు పట్టుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు బాధితురాలి ఇంటికి వచ్చి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిర్మల్ రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. డెలివరీ బాయ్ విఘ్నేశ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు నిర్మల్ రూరల్ సీఐ రామకృష్ణ, ఎస్సై సాయికుమార్ తెలిపారు.

జైనూర్ ఘటనపై ఎన్‌హెచ్‌ఆర్సీ సీరియస్

నివేదిక ఇవ్వాలని డీజీపీకి ఆదేశం

హైదరాబాద్, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ): కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని జైనూర్ పట్టణంలో ఇటీవల జరిగిన లైంగికదాడి ఘటనపై జాతీయ మహిళా కమిషన్ తీవ్రంగా స్పందించింది. ఈ ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని డీజీపీ జితేందర్‌ను ఆదేశించింది. మహిళపై లైంగికదాడి, హత్యాయత్నానికి గల కారణాలేంటో వివరించాలని కోరింది. ఈ అంశంపై రెండు వారాల్లోగా వివరణాత్మక నివేదిక ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి, డీజీపీకి నోటీసులు జారీచేసింది. ఎఫ్ఐఆర్ స్థితి, బాధితురాలి ఆరోగ్యం, కౌన్సెలింగ్, రాష్ట్ర అధికారుల ద్వారా ఆమెకు పరిహారం అందించడానికి సరైన నివేదిక ఇవ్వాలని పేర్కొన్నారు.

ఏపీ వరదలతో 6,882 కోట్ల నష్టం

హైదరాబాద్, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ) : ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలకు 46 మంది ప్రాణాలు కోల్పోయారని ప్రభుత్వం అధికారిక ప్రకటన విడుదల చేసింది. 540 పశువులు మృతి చెందాయని, 4.90 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరుగగా, 49వేల ఎకరాల్లో ఉద్యాన, 200 ఎకరాల్లో సెరికల్చర్‌కు నష్టం జరిగిందని అధికారులు వెల్లడించారు. 5,921 కిలోమీటర్ల మేర రహదారులు ధ్వంసమయ్యాయని తెలిపారు. 76 విద్యుత్తు ఉపకేంద్రాలు ముంపుబారిన పడగా, 1,283 ఎల్టీ ఎలక్ట్రిక్ స్తంభాలు, 1,668, 11 కేవీ ఎలక్ట్రిక్ స్తంభాలు దెబ్బతిన్నాయన్నారు. ప్రాథమిక అంచనా మేరకు రూ. 6882 కోట్ల నష్టం వాటిల్లినట్టు కేంద్రానికి ప్రభుత్వం నివేదికను అందజేసింది.

ఐకే-1ఏ గనిలో ఊపిరాడక కార్మికుడి మృతి

- యాజమాన్యమే బాధ్యత వహించాలని హెచ్ఎంఎస్ కార్మిక సంఘం డిమాండ్
- గనిపై కార్మికుల ధర్నా

ఎల్లవేన శ్రీనివాస్(ఫైల్)

జైపూర్, సెప్టెంబర్ 10 : శ్రీరాంపూర్ డివిజన్‌లోని ఇందారం ఖని-1ఏ గనిలో మంగళవారం మొదటిషిఫ్టులో పని చేస్తున్న జనరల్ మజ్దూర్ ఊపిరాడక మృతిచెందాడు. తోటి కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. గోదావరిఖనిలోని గాంధీనగర్‌కు చెందిన ఎల్లవేన శ్రీనివాస్ (35) ఐకే-1ఏ మొదటి షిఫ్టు అండర్ గ్రౌండ్‌లో ఎస్-1 ప్యానల్ 35వ డిప్-4 లెవల్ వద్ద మంగళవారం విధులు నిర్వహిస్తుండగా, గాలి అందక కుప్పకూలిపోయాడు. గమనించిన తోటి కార్మికులు వెంటనే అండర్ గ్రౌండ్ నుంచి బయటకు తీసుకువచ్చారు. అంబులెన్స్‌లో రామకృష్ణాపూర్ ఏరియా హాస్పిటల్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. గనిలో వెంటిలేషన్ సరిగా లేకపోవడం వల్లే శ్రీనివాస్ మృతిచెందినట్టు కార్మికులు పేర్కొంటున్నారు.

గనిపై హెచ్ఎంఎస్ కార్మికుల నిరసన

శ్రీనివాస్ మృతికి యాజమాన్యమే బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తూ హెచ్ఎంఎస్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గనిపై ధర్నా నిర్వహించారు. నాయకులు, కార్మికులు మాట్లాడుతూ కొంతకాలంగా 34, 35, 53 డిప్‌లలో గాలి సరఫరా లేదని కార్మికులు యాజమాన్యానికి మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని, తాజాగా కార్మికుడు ఊపిరాడక చనిపోతే గుండెపోటు, ఫిట్స్‌తో చనిపోయాడని కట్టుకథలు చెబుతున్నారని మండిపడ్డారు. ఇందుకు కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలని హెచ్ఎంఎస్ ఉపాధ్యక్షుడు సారయ్య డిమాండ్ చేశారు. తన భర్త పని ప్రదేశంలోనే మృతి చెందినప్పటికీ బతికి ఉన్నట్టుగా అధికారులు దవాఖానకు తరలించి వైద్యం అందించినట్టు చిత్రీకరించారని శ్రీనివాస్ భార్య అనిత వాపోయింది.

గోదావరికి పోటెత్తిన వరద

- భద్రాచలం వద్ద 48.50 అడుగుల వద్ద ప్రవాహం

బూర్గంపహాడ్ (భద్రాచలం)/ఏటూరునాగారం/మంగపేట/వాజేడు, సెప్టెంబర్ 10: ఎగువ నుంచి వస్తున్న వరదతో భద్రాచలం వద్ద గోదావరి పోటెత్తింది. మంగళవారం సాయంత్రం 5.15 గంటలకు ప్రవాహం 48 అడుగులకు చేరడంతో రెండో ప్రమాద హెచ్చరిక జారీచేశారు. రాత్రి 7 గంటలకు రెండో ప్రమాద హెచ్చరికను దాటి 48.50 అడుగుల వద్ద గోదావరి ఉరకలు వేస్తుండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఇటు పెరుగుతున్న గోదావరికి తోడు.. అటు శబరి వరద కూడా పోటెత్తింది. చింతూరు వద్ద శబరి నది పోటెత్తడంతో సారపాక, భద్రాచలం వద్ద ఆంధ్రా, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు వెళ్లే లారీలు, ఇతర వాహనాల రాకపోకలను పోలీసు అధికారులు నిలిపివేశారు.

ఏటూరునాగారం పుష్కరఘాట్ వద్ద..

ఎగువ నుంచి వస్తున్న వరదతో ములుగు జిల్లా ఏటూరునాగారం రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద ప్రవాహం రెండో ప్రమాద హెచ్చరిక స్థాయికి చేరువైంది. మంగళవారం సాయంత్రం 4 గంటలకు పుష్కరఘాట్ వద్ద 15.800 మీటర్లకు చేరుకున్నది. 15.830 మీటర్లకు చేరితే రెండో ప్రమాద హెచ్చరికను జారీ చేస్తారు.

కరీంనగర్-ముంబై మధ్య 4 ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, సెప్టెంబర్ 10(నమస్తే తెలంగాణ) : దీపావళి, ఛాట్ సందర్భంగా ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేసినట్టు రైల్వే అధికారులు తెలిపారు. కరీంనగర్-ముంబై మధ్య అక్టోబర్ 29 నుంచి నవంబర్ 6 వరకు ఈ రైళ్లు రాకపోకలు సాగిస్తాయన్నారు.

సవాళ్లను అధిగమించాలి

హైదరాబాద్, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ) : కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన నూతన న్యాయ చట్టాల అమలులో ఎదురయ్యే సవాళ్లను పోలీసులు, జైళ్లశాఖ సిబ్బంది అధిగమించాలని జైళ్లశాఖ డీజీ సౌమ్యామిశ్రా సూచించారు. మంగళవారం చంచల్‌గూడ జైలులో బీపీఆర్ అండ్ డీ, కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో కొత్త న్యాయచట్టాలపై శిక్షణను ఆమె ప్రారంభించారు.

వాణిజ్య

టాటా ఈవీలు చౌక

3 లక్షలదాకా తగ్గిన నెక్సాన్ ధర • పంచ్, టియాగోలూ అగ్గువే

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10: టాటా మోటర్స్ ఎలక్ట్రిక్ వెహికిల్స్ (ఈవీ) ధరలు తగ్గాయి. ఆయా మాడళ్లపై ఏకంగా రూ.3 లక్షలదాకా తగ్గించినట్టు మంగళవారం సంస్థ ప్రకటించింది. పాపులర్ మాడల్ నెక్సాన్ ఈవీ రేటు రూ.3 లక్షల వరకు దించినట్టు సంస్థ తెలియజేసింది. అలాగే పంచ్ ఈవీ ధరపై రూ.1.2 లక్షలదాకా, టియాగో ఈవీపై రూ.40,000 వరకు తగ్గింపులనిస్తున్నట్టు పేర్కొన్నది. 'ఈ ప్రత్యేక, పరిమిత కాల ధరల తగ్గింపుతో ఈవీలనూ పెట్రోల్/డీజిల్ కార్ల ధరలకు దగ్గరగా తీసుకెళ్తున్నాం' అని టాటా ప్యాసింజర్ ఎలక్ట్రిక్ మొబిలిటీ చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ వివేక్ శ్రీవాత్సవ అన్నారు. అంతేగాక తమ ఈ నిర్ణయంతో రెగ్యులర్ కార్ల కొనుగోలుదారులూ ఈవీలను ట్రై చేస్తారన్న ఆశాభావాన్ని ఆయన కనబర్చారు. నిజానికి ఇప్పటికే టియాగో, నెక్సాన్, హరియర్, సఫారీ వంటి మాడళ్ల ధరల్ని టాటా మోటర్స్ రూ.65,000ల నుంచి రూ.1.8 లక్షల వరకు తగ్గించింది. ఈ క్రమంలో ఈవీల రేట్లనూ భారీగా కోతపెట్టింది. దీంతో ఈ పండుగ సీజన్‌లో టాటా అమ్మకాలు మరింత పెరగడం ఖాయమన్న అభిప్రాయాలు మార్కెట్ వర్గాల్లో ఉన్నాయి. పైగా ప్రస్తుతం ఈవీ మార్కెట్‌లో టాటా మోటర్స్‌దే పైచేయి. తాజా ప్రకటనతో టాటా ఈవీల సేల్స్ ఇంకా పుంజుకుంటాయన్న అంచనాలు ఇండస్ట్రీ వర్గాల్లోనూ వినిపిస్తున్నాయి.

సియామ్ అధ్యక్షుడిగా శైలేశ్ చంద్ర

సియామ్ కొత్త అధ్యక్షుడిగా టాటా మోటర్స్ ప్యాసింజర్ వెహికిల్స్ ఎండీ శైలేశ్ చంద్ర ఎన్నికయ్యారు. ఈ మేరకు మంగళవారం జరిగిన ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో ఎన్నుకున్నట్టు సియామ్ అధికారికంగా ప్రకటించింది. 2024-25కుగాను ఈయన ఎంపిక జరిగింది. కాగా, గతంలో సియామ్ ఉపాధ్యక్షుడిగా చంద్ర పనిచేశారు. ఇప్పటిదాకా వోల్వో ఐషర్ కమర్షియల్ వెహికిల్స్ ఎండీ, సీఈవో వినోద్ అగర్వాల్ ఉన్నారు. ఈయన స్థానంలోకి చంద్ర వస్తున్నారు. ఇక సియామ్ ఉపాధ్యక్షుడిగా అశోక్ లేలాండ్ ఎండీ, సీఈవో శేను అగర్వాల్, కోశాధికారిగా దైమ్లర్ ఇండియా కమర్షియల్ వెహికిల్స్ సీఈవో సత్యకమ్ ఆర్య ఎన్నికయ్యారు.

సింగిల్ చార్జింగ్‌తో 500 కి.మీ.

దేశీయ ఈవీ మార్కెట్‌లో గ్రాండ్ ఎంట్రీకి మారుతీ సుజుకీ ప్లాన్

వచ్చే ఏడాది జనవరిలో మధ్య శ్రేణి ఎస్‌యూవీని తేనున్న సంస్థ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10: దేశీయ ఆటో రంగ దిగ్గజం మారుతీ సుజుకీ.. ఎలక్ట్రిక్ వెహికిల్ (ఈవీ) మార్కెట్‌లో గ్రాండ్ ఎంట్రీకి ప్లాన్ చేస్తున్నది. పెట్రోల్, డీజిల్, సీఎన్‌జీ ఆధారిత వాహన మార్కెట్‌లో దూసుకుపోతున్న మారుతీ.. విద్యుత్తు ఆధారిత వాహన మార్కెట్‌లో మాత్రం వెనుకబడిపోయింది. దాదాపుగా అన్ని సంస్థలు ఈవీ సెగ్మెంట్‌పై ఇప్పుడు గట్టిగానే ఫోకస్ చేస్తున్నాయి మరి. ఈ క్రమంలో మారుతీ సైతం వచ్చే ఏడాది జనవరిలో తమ తొలి ఈవీ మాడల్‌ను మార్కెట్‌కు పరిచయం చేయాలనుకుంటున్నది. సింగిల్ చార్జింగ్‌తో 500 కిలోమీటర్లకుపైగా ప్రయాణించేలా ఓ మధ్య శ్రేణి ఎస్‌యూవీని తీసుకురాబోతున్నది. ఈ మేరకు మంగళవారం ఇక్కడ జరిగిన 64వ సియామ్ వార్షిక సమావేశానికి హాజరైన మారుతీ సుజుకీ ఇండియా సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (మార్కెటింగ్ అండ్ సేల్స్) పార్థో బెనర్జీ విలేకరులకు తెలిపారు. అయితే ధర ఎంత? అన్న వివరాలు మాత్రం తెలియజేయలేదు.

ఇన్‌ఫ్రాపై గురి

ఈవీ మార్కెట్‌లోకి ప్రవేశించే ముందు వాహనదారుల సౌకర్యార్థం పటిష్టమైన మౌలిక సదుపాయాల వ్యవస్థను ఏర్పర్చాలని మారుతీ సుజుకీ భావిస్తున్నది. అందుకే ఈవీల చార్జింగ్ స్టేషన్లను నెలకొల్పే దిశగా అడుగులు వేస్తున్నట్టు బెనర్జీ వెల్లడించారు. అలాగే తమ ఈవీ కార్లను కొన్నవారు ఐదేండ్ల తర్వాత అమ్ముకున్నా తగిన రేటు పలికేలా కృషి చేస్తున్నట్టు వివరించారు. ఆటో మార్కెట్‌లో రీసేల్ వాల్యూ కూడా ముఖ్యమేనన్నారు. 'మేము కేవలం ఈవీలనే మార్కెట్‌కు పరిచయం చేయాలనుకోవడం లేదు. కస్టమర్లకు కావాల్సిన అన్ని సౌకర్యాలనూ కల్పించాలనుకుంటున్నాం' అని వ్యాఖ్యానించారు. ఇదిలావుంటే 2030కల్లా ఎగుమతుల్ని మరింత పెంచుకోవాలని ప్రయత్నిస్తున్నట్టు సియామ్ సమావేశంలో మాట్లాడుతూ సంస్థ ఎండీ, సీఈవో హిసాషి తెలిపారు.

పండుగ సీజన్‌లో ఆఫర్లు?

గతకొద్ది నెలలుగా మార్కెట్‌లో నెలకొన్న మందగమనంతో ఆటో అమ్మకాలు అంతంతమాత్రంగానే సాగుతున్నాయి. డిమాండ్ లేక వాహనాలు పెద్ద ఎత్తున డీలర్ల దగ్గరే ఉండిపోతున్నాయి. దీంతో వాహన తయారీ సంస్థలు సైతం ఎక్కువగా సరఫరా చేయడం లేదు. ఈ నేపథ్యంలో రాబోయే పండుగ సీజన్‌పై అన్ని కంపెనీలు భారీగానే ఆశలు పెట్టుకున్నాయి. ముఖ్యంగా డీలర్ల వద్ద మిగిలిపోయిన వాహనాలన్నీ తరిగిపోయేలా, కొనుగోలుదారులను ఆకర్షించేలా ఆయా మాడల్స్‌పై ఆఫర్లను తేవాలని చూస్తున్నట్టు తెలుస్తున్నది. ఇక ప్రస్తుత పరిస్థితులకు తగ్గట్టుగా నిర్ణయాలు తీసుకుంటున్నామని బెనర్జీ తెలియజేశారు. దీంతో ఈ పండుగ సీజన్‌లో కార్ల ధరలు తగ్గవచ్చన్న అంచనాలు ఊపందుకున్నాయి. ఏటా దసరా, దీపావళి, క్రిస్మస్, న్యూ ఇయర్‌లతో రాబోయే 3-4 నెలలు ఆటో మార్కెట్‌లో సందడి నెలకొంటుంది. దీన్ని ఒడిసిపట్టుకొని బిజినెస్‌ను పెంచుకోవాలని అంతా సహజంగానే ప్రయత్నిస్తుంటారు.

ధర దిగిన ఐఫోన్లు

10 వేల వరకు తగ్గించిన సంస్థ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10: ఐఫోన్ 16ని మార్కెట్లోకి విడుదల చేసిన మరుక్షణమే ఇతర ఐఫోన్ల ధరలను తగ్గించింది యాపిల్ సంస్థ. ప్రతియేటా కొత్త మాడల్‌ను విడుదల చేస్తున్న సంస్థ..ఆ మరుసటి రోజే ఇతర ఫోన్ల ధరలను భారీగా తగ్గిస్తున్నది. దీంట్లోభాగంగా ఐఫోన్ 15, ఐఫోన్ 14 సిరీస్ మాడళ్ల ధరలను రూ.10 వేల వరకు తగ్గించింది. ఈ నూతన ధరలు వెంటనే అమలులోకి రానున్నట్లు పేర్కొంది. దీంతో ఐఫోన్ 15 మాడల్ ప్రారంభ ధర రూ.69,900కి దిగొచ్చింది. ధరలు తగ్గించకముందు ఇది రూ.79,900గా ఉన్నది. అలాగే ఐఫోన్ 15 ప్లస్ మాడల్ కూడా రూ.89,900 నుంచి రూ.79,900కి దించింది. వీటితోపాటు ఐఫోన్ 14, ఐఫోన్ 14 ప్లస్ మాడళ్లను కూడా రూ.10 వేల వరకు తగ్గించింది. దీంతో ఐఫోన్ 14 ధర రూ.69,900 నుంచి రూ.59,900కి దిగొచ్చింది. దేశవ్యాప్తంగా ఉన్న యాపిల్ స్టోర్లతోపాటు భాగస్వామ్య రిటైల్ అవుట్‌లెట్లలో తగ్గింపు ధరకే ఈ ఫోన్లను విక్రయిస్తున్నారు. ప్రస్తుత పండుగ సీజన్‌లో ఈ-కామర్స్ దిగ్గజాలైన అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌ల్లో ఈ ఫోన్ల ధరలు మరింత తగ్గే అవకాశాలు కూడా ఉన్నాయి. ముఖ్యంగా ఎక్స్ఛేంజ్ ఆఫర్లతోపాటు బ్యాంక్ డిస్కౌంట్లు కూడా ఉండనున్నాయి.

హైదరాబాద్‌లో ప్లాస్టిక్ రీసైక్లింగ్ ప్లాంట్

రూ.50 కోట్లతో ఏర్పాటు చేసిన రీ సస్టెయినబిలిటీ

హైదరాబాద్, సెప్టెంబర్ 10: ప్లాస్టిక్ వ్యర్థాలను పునర్‌వినియోగంలోకి తేవడానికి రీ సస్టెయినబిలిటీ..ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ షార్ప్ వెంచర్స్‌తో జట్టుకట్టింది. దేశవ్యాప్తంగా ప్లాస్టిక్ వ్యర్థాలు అధికమవుతుండటంతో ప్రతియేటా వాతావరణ కాలుష్యం జరుగుతున్నదని, దీనిని తగ్గించడానికి తొలి విడుతలో హైదరాబాద్‌తోపాటు ఛత్తీస్‌గడ్‌లలో రూ.50 కోట్ల పెట్టుబడితో రీసైక్లింగ్ ప్లాంట్లను నెలకొల్పినట్లు రీ సస్టెయినబిలిటీ లిమిటెడ్ ఎండీ, సీఈవో మసూద్ మాలిక్ తెలిపారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన యూనిట్ సామర్థ్యం 24 వేల టన్నులు కాగా, రాయ్‌పూర్‌లో 8 వేల టన్నులు కలుపుకొని మొత్తంగా ప్రతియేటా 32 వేల టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు పునర్‌వినియోగంలోకి రానున్నట్లు చెప్పారు. దీంతో ప్రతియేటా 15 వేల టన్నుల కార్బన్‌డయాక్సైడ్ తగ్గనున్నదన్నారు. వచ్చే రెండేండ్లలో ఈ కెపాసిటీని 10 లక్షల టన్నులకు పెంచడానికి మూడు నుంచి ఐదు యూనిట్లను నెలకొల్పబోతున్నట్లు ప్రకటించారు. ఇందుకోసం రూ.100 కోట్ల వరకు ఖర్చు